# ప్రతిష్ఠాపరుడు

---

అసెంబ్లీ ప్రశ్నలకు సమాధానాలు రాస్తున్నాను.

ప్రశ్న:- (ఏ) మీ డిపార్టుమెంటులో చాలా కరప్షన్ వున్నట్టు పుకార్లు. ఇవి నిజమేనా ?

(బి) నిజమైతే, దాన్ని నిర్మూలంచెయ్యటానికి ప్రభుత్వం ఏం చర్య తీసికొంటోంది ?

సమాధానం :- (ఏ) పుకార్లు నమ్మదగినవికావు.

(బి) కేవలం పుకార్లపైన ఆధారపడి ప్రభుత్వం ఏం చర్య తీసుకోదు. ప్రత్యేక కేసులేవైనా మా దృష్టికి వస్తే తగు చర్య తీసికోగలం.

సమాధానం రాసి మాపై ఆఫీసరు ఆమోదానికి తీసికెళ్ళాను. అతను దాన్నిచూసి, కొంచంసేపు దీర్ఘంగా ఆలోచించి, ఆఖరికి మార్పు లేకుండానే సంతకంపెట్టాడు. కాగితం నాచేతికిస్తూ, "నీఅభిప్రాయమేమిటి?

నిజంగానే మన డిపార్టుమెంటులో కరప్షని లేదా ?" అన్నాడు నన్ను చూస్తూ.

నేను కాస్త తికమకపడ్డాను. మా ఆఫీసరు చాలా గట్టివాడనీ, డబ్బు విషయాల్లో నిప్పువంటివాడనీ ప్రతీతి. కాని ఎప్పుడూ మేమీ విషయాలు ముఖాముఖి చర్చించుకోలేదు.

"నేనలా అన్లేదే!" అన్నాను.

"మరాసమాధానానికి అంతేగా అర్థం?"

"ఆ పిచ్చి ప్రశ్నకి అదే సరైన సమాధానం.... ఈ ప్రశ్నోత్తరాలవల్ల సమసిపోయేంతటి తేలికైన సమస్యకాదు కరప్షన్."

"మరీ?"

"కేవలం మన ఒక్క డిపార్టుమెంటులోనేగాదు, మొత్తం జాతిలోనే వుంది కరప్షన్. జాతి బాగుపడితేగాని మన డిపార్టుమెంటూ బాగుపడదు. కాని ప్రస్తుత పరిస్థితుల్లో నాకీ ఆశలేదు."

"జాతి బాగుపడటం ఎలా ?"

"ఇప్పటి రాజకీయ సాంఘిక విధానాల్లో చాలా మార్పులురావాలి."

"అబ్బాయి! ఇవన్నీ కాలేజీ కబుర్లు. నాకు నమ్మకంలేదు. ఏ తెగవారు ఆ తెగని బాగుపరుచుకుంటే దేశంతప్పకండా బాగుపడుతుంది"

నేను మాట్లాడలేదు.

ఇంతలో మా ఈస్టర్న్ సర్కిల్ ఆఫీసరు గబగబా గదిలోకివచ్చాడు. అతణ్ణిమాడగానే ఎందుకొచ్చాడో గ్రహించుకున్నాను. ఈవలికి వచ్చేశాను.

అర్ధగంట తర్వాత మళ్ళీ మా ఆఫీసరు పిలిపించాడు.

"నేను నీతో ఒక కాన్ఫిడెన్షియల్ విషయం మాట్లాడాలి" అన్నాడు నేను వెళ్ళి కూర్చోగానే.

"చిత్తం"

"ఇందాక మన ఈస్టర్న్ సర్కిల్ ఆఫీసర్ ఎందుకొచ్చాడో తెలుసా?"

"తెలుసు..."

"ఆ... తెలుసా!" ఉలిక్కిపడ్డాడు.

"తెలుసు...... అతనికింద వున్న ఒక సీనియర్ ఆఫీసర్‌ని నిన్ననే పోలీసులు లంచంకేసులో అరెస్టుచేశారు. ఇతనా ఆఫీసర్‌కి బెయిల్ ఇచ్చి విడిపించాడు. ఇప్పుడా కేసుని తలక్రిందులుచేయ ప్రయత్నించటానికి పట్నం వచ్చాడు."

"ఇదంతా నీకెలా తెలుసు?"

"నాకే కాదు, మన హెడ్డాఫీసులో అందరికీ తెలుసు." మా ఆఫీసరు చాలా బాధపడుతూన్నట్లుగా కనిపించాడు. దీర్ఘంగా ఆలోచిస్తూ సిగరెటు ముట్టించాడు.

కొంచం ఆగి, "మీ వుద్దేశమేవిఁటి?" అన్నాను.

నా ప్రశ్నకు సమాధానం ఇవ్వకండానే అన్నాడు, "ఇందాక నువన్నావే, కరప్షన్ ఒక్క మన డిపార్టుమెంటులోనే కాదు అన్నిచోట్లా వుందని, అది నిజం,"

"మీరన్నట్లు ఏ తెగవారు ఆ తెగని బాగుపర్చుకుంటే మొత్తం దేశం బాగుపడుతుందనేదాంట్లోనూ నిజం లేకపోలేదు."

"అవుననుకో, అయినా ఇందర్లో మనమేనా అప్రతిష్ఠపాలు కావటం?''

"అప్రతిష్ఠ ఎవరికీ?"

"మన డిపార్టుమెంటుకీ, డిపార్టుమెంటు హెడ్డునైన నాకూను."

"అయితే ప్రతిష్టకోసం మీరూ ఆ ఆఫీసరుకు సహాయం చేయ దలుచుకున్నారా!"

"అదే ఆలోచిస్తున్నాను... ఏ సబార్డినేటో అయితే వెంటనే నేనే డిసిమిస్ చేసి వుందును. కాని నాకింద పనిచేస్తోన్న ఒక సీనియర్ ఆఫీసర్ కరప్షన్‌లో పట్టుపడటమంటే నాకెంత అవమానమో కాస్త ఆలోచించు..."